క్లుప్తంగా

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, వైశాఖ మాసం, కృత్తిక నక్షత్రం చతుర్దశి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయస్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చ,లా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

బంగారు భవితే లక్ష్యం

- దివ్యాంగులు బడిబాట పట్టేలా సమగ్ర శిక్ష అధికారుల సర్వే
- ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ఉపయోగం
- శిక్షణ, బోధనతో వారి బతులకు బంగారు బాట


ఇంటి సర్వే చేస్తున్న అధికారులు

అద్దంకి: ప్రత్యేక అవసరాల పిల్లలు ఇంటికే పరిమితం కాకుండా వారిని శారీరకంగా, మానసికంగా ఎదిగేలా చేసి వారి భవితకు బంగారు బాటలు వేయాలని సమగ్రశిక్ష ఇంటింటి సర్వేతో వారిని గుర్తించే పనిని చేపట్టింది. గతేడాది నుంచే పునాదులు వేసింది. సాధారణ పిల్లల నుంచి తమను వేరు చేశారనే భావన కలుగకుండా వారిని సాధారణ పిల్లలు చదివే పాఠశాలల్లోనే చేర్పించి విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు విధివిధానాలు తయారు చేసుకుని ప్రాథమిక పాఠశాలకు సమీప భవిత కేంద్రాలను వాటితో అనుసంధానించారు. సాధారణ పిల్లలతో కలిసి వారు విద్యను అభ్యసించడం ద్వారా వారిలో ఆత్మన్యూనతా భావం తొలగేలా చూడాలన్నదే భావనతో ప్రభుత్వ ఈనిర్ణయం తీసుకుంది.

అసాధారణ వైకల్య పిల్లలకు ఇంటి వద్దనే విద్య..

అయితే మాటలు రాని, మానసిక ఎదుగులదల లేని పిల్లలు, ఇళ్లలో ఉండి మరింత మానసింకగా కుంగిపోకుండా, వారిని గుర్తించి భవిత కేంద్రాల ద్వారా విద్యను నేర్పించి సాధారణ విద్యను బోధించే విధంగా రూకల్పన చేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సాధారణ పిల్లతో బోధన జరిగేలా మండలానికి ఒక పాఠశాలన అనుసంధానం చేశారు. అక్కడ ఐఈఆర్‌టీలు ప్రత్యేక అవసరాల పిల్లల టీచర్లతో పిల్లలకు విద్యను బోధిస్తారు. అక్కడే మధ్యాహ్న భోజనం, విద్యా కానుక, కిట్లు, వంటి సౌకర్యాలు కల్పిస్తారు. ఫిజియోథెరపీ, వ్యాయామం, స్పీచ్‌థెరపీ, యోగా, తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు. ఐఈఆర్‌టీలు ఫియోథెరపిస్టుల పర్యవేక్షణలో పనిచేయాల్సి ఉంటుంది.

బహుళ ప్రయోజనాలు..

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు పాఠశాలలో చేరితే ప్రతి నెలా రూ.300 రవాణా చార్జీలు చెల్లిస్తారు. వినికిడి లోపం, దృష్టి లోపం, ఉన్న వారికి ట్యాబ్‌లతోతోపాటు తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనం ఏడాదికి రూ.9 వేల నుంచి రూ.11 వేల వరకు అందజేస్తారు. వైకల్య శాతం అధికంగా ఉంటే చదవలేరని ధ్రువపత్రంతో పింఛన్ అందిస్తారు. బస్సు రైల్వేలో పాస్ సౌకర్యంతో పాటు పాఠశాలకు రాలేని వారికి ఇంటికి వెళ్లి బోధన చేస్తారు. ఇలాంటి వారు పాఠశాలకు రాకున్నా వచ్చినట్లే హాజరు వేస్తారు. ప్రత్యేక శిక్షణతో వారిని ఆయా తరగతులు ఉత్తీర్ణులయ్యేలా చేసి తద్వారా వారికి ఉద్యోగాలు సాధించి తమ బతుకు తాము బతికేలా కృషిచేస్తోంది ప్రభుత్వం.

సద్వినియోగం చేసుకోవాలి..

ప్రభుత్వ ఆదేశాల మేరకు దివ్యాంగులు బడిబాట పట్టేలా సర్వే ముమ్మరం చేశాం. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సాధారణ విద్యను బోధిస్తూనే పిల్లల్లో సామర్థ్యం పెంచేలా వివిధ రకాల పరికరాలతో చికిత్స చేయించే విధంగా చర్యలు తీసుకుంటారు. వారికి లైఫ్ స్కిల్స్ నేర్పించి తమకో లోపం ఉందనే జ్ఞాపకం లేకుండా తోటి పిల్లల వలే జీవించే విధంగా ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– గంగాధర్, ఎంఈవో

వ్యర్థాల పొగతో రహదారిపై ప్రమాదాలు

పర్చూరు (చినగంజాం): పంచాయతీ పడేస్తున్న వ్యర్థాలతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పర్చూరు పంచాయతీ పరిధిలో నిత్యం వస్తున్న చెత్త చెదారాన్ని రహదారికి ఇరువైపులా పడవేసి సిబ్బంది వాటిని తగులబెడుతున్నారు. వ్యర్థాల నుంచి వచ్చే పొగ రోడ్డంతా అలముకుంటుంది. నిత్యం భారీ వాహనాలు, ద్విచక్రవానాలు, ఇతర వాహనాలతో వెళ్లే వారితో రోడ్డు రద్దీగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో వాహనాదారులకు పొగ కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడక పోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంతేగాకుండా పలు రకాల వ్యర్థాల నుంచి వచ్చే పొగ కావడంతో అది శ్వాసకోసలోకి చేరి ఊపిరాడక వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం వ్యర్థాల వలన వచ్చే సమస్యలను తొలగించేందుకు డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని పలుమార్లు మొత్తుకుంటున్నా పంచాయతీ సిబ్బంది లక్ష్యపెట్టకుండా వాటిని రోడ్డు మార్జిన్‌ల పడవేయడం, వాటిని తగులబెట్టడంతో వాటి నుండి వచ్చే దట్టమైన పొగతో వాహన చోదకులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవాల్సి పరిస్థితి దాపురించింది. కిషోర్‌బాబు అనే యువకుడు ద్విచక్రవాహనంపై వస్తుండగా పొగ అలము కోవడంతో ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది, స్థానికంగా ఉన్న కొందరు వ్యక్తులు ప్రమాదం నుండి అతనిని కాపాడారు. ఇలాంటి పరిస్థితిలో పంచాయతీ సిబ్బంది వ్యర్థాలను డంపింగ్ యార్డుల్లో పడవేసే విధంగా చేసి ప్రమాదాలను నివారించాల్సిందిగా స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి..

నేను ప్రతి నిత్యం పర్చూరు నుంచి చీరాల వైపు నా ద్విచక్రవాహనంపై వెళ్తుంటాను. రోడ్డుకు ఇరువైపులా వేస్తున్న వ్యర్థ పదార్థాలను పంచాయతీ సిబ్బంది తగులబెడుతుండటంతో పొగ దట్టంగా అలముకుంటుంది. దాంతో ఊపిరాడక పోగా వాహనాలు సైతం కన్పించకుండా పోతున్నాయి. దాంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు సత్వరం చర్యలు తీసుకొని సమస్యను తొలగించాలని కోరుకుంటున్నాను.

– నలిగల కిషోర్‌బాబు

వృద్ధులకు అన్నదానం


ఆశ్రమ నిర్వాహకుడికి విరాళం అందజేస్తున్న దాత

మార్టూరు: గుంటూరు ఏటి అగ్రహారం గ్రామానికి చెందిన చోడా భద్రయ్య మాధవీలత స్థానిక అమ్మ ఆశ్రమంలో అన్నదానం జరిపించి వృద్ధులకు స్టీల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఆశ్రమ నూతన భవనానికి రూ.5116 సహాయం అందజేశారు. వారికి ఆశ్రమ అధ్యక్షుడు గుంటుపల్లి చందు ధన్యవాదాలు తెలియజేశారు.

ఏటీఎం సెంటర్లలో పనిచేయని ఏసీలు

- ఉక్కపోతతో అల్లాడిపోతున్న ఖాతాదారులు
- స్పందించాలంటూ ఖాతాదారుల వేడుకోలు

చీరాల రూరల్: ఖాతాదారులు బ్యాంకుకు పాసు బుక్ తీసుకెళ్లి విత్‌డ్రా ఫాం పూర్తిచేసి తనకు తన అకౌంట్‌లో నుంచి నగదు డ్రా చేసి ఇవ్వాలని సంబంధిత బ్యాంకు అధికారిని అడిగితే నీకు ఏటీఎం కార్డు లేదా లేకపోతే వెంటనే ఏటీఎం కార్డుకు అప్లై చేసుకో అంటూ డబ్బులు డ్రా చేయనీయకుండా కుంటిసాకులు చెప్పి బ్యాంకుల్లో డబ్బులు ఇవ్వకుండా తిరిగి పంపిస్తారు అధికారులు. కానీ ఏటీఎం కార్డులు ఉన్న ఖాతాదారులకు ఏటీఎంలలో డబ్బులు డ్రా చేసుకోవడానికి వెళ్తే ఏటీఎం కేంద్రాల్లో ఖాతాదారులకు సరైన సౌకర్యాలు ఉండడం లేదు. కేంద్రాల్లో ఏసీలు పనిచేయక ఉక్కపోతతో ఖాతాదారుల చొక్కాలు తడిసిపోవాల్సిందే.


రైల్వేస్టేషన్ ఎదురుగా గల బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎం


చీరాల ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్ ఎదురు జంజనం కాంప్లెక్సులో ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ ఏటీఎం

వివరాల్లోకి వెళితే...

గతంలో ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన ఏటీఎం సెంటర్లు కొంతకాలం ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాయి. ఖాతాదారులు బ్యాంకులకు వెళ్లకుండా ఏటీఎం సెంటర్లలోనే డబ్బులు డ్రా చేసుకునేవారు. ఏటీఎంలలో ఎనీ టైం మనీ ఉండే విధంగా సంబంధిత బ్యాంకుల అధికారులు చర్యలు తీసుకున్నారు. కానీ ఇటీవల కాలంలో బ్యాంకుల అధికారులు ఏటీఎం కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో కొన్ని ప్రాంతాల్లోని ఏటీఎంలలో ఏసీలు పనిచేయకపోవడం మరికొన్ని సెంటర్లలో గార్డులు లేకపోవడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. చీరాల పట్టణంలోని కొన్ని బ్యాంకులకు చెందిన ఎనీ టైం మనీ (ఏటీఎం) సెంటర్లలో ఎయిర్ కండిషనర్‌లు (ఏసీలు) పనిచేయకపోవడంతో ఏటీఎం సెంటర్లో నగదు డ్రా చేసుకునేందుకు లోపల పట్టుమని పది నిమిషాలు కూడా ఉండలేని పరిస్థితి నెలకొందని ఖాతాదారులు వాపోతున్నారు. ఏసీ పనిచేయని కారణంగా లోపల గాలిరాక ఉక్కపోతతో చెమటలుకారి చొక్కాలు తడిసిపోతున్నాయని ఖాతాదారులు బెంబేలెత్తిపోతున్నారు. పట్టణంలోని ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్ ఎదురుగాల జంజనం కాంప్లెక్సులోని ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్లో ఏసీలు పనిచేయడం లేదు. అసలే మండుతున్న ఎండలు ఒకపక్క ఉక్కపోత కారణంగా ఏసీలు లేని ఆ సెంటర్లో పట్టుమని పది నిమిషాలు కూడా ఖాతాదారులు లోపల ఉండలేని పరిస్థితి నెలకొంది. అలానే రైల్వే స్టేషన్ ఎదురుగా గల బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎంలో కూడా ఏసీలు పనిచేయడం లేదు. అలానే పట్టణంలోని మరికొన్ని ఏటీఎంలలో కూడా కనీస సౌకర్యాలు ఉండడంలేని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా బ్యాంకుల ఉన్నతాధికారులు స్పందించి ఏటీఎంలలో మెరుగైన సౌకర్యాలు కల్పించి ఖాతాదారులు కోరుతున్నారు.


ఎస్‌బీఐ ఏటీఎంలో అలంకారప్రాయంగా ఉన్న పనిచేయని ఏసీలు

రెండు నెలలుగా పనిచేయడం లేదు



ఎస్‌బీఐ ఏటీఎంలో రెండు నెలలుగా ఏసీలు పనిచేయడంలేదు. డబ్బులు డ్రా చేసుకునేందుకు ఏటీఎంలోకి వెళితే ఏసీలు పనిచేయని కారణంగా ఉక్కపోతతో విపరీతమైన చెమటలు పోసి శరీరమంతా నీరుకారి చొక్కాలు తడిసిపోతున్నాయి. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే ఏటీఎంలలోకి వెళ్లే పరిస్థితి ఉండదు.

–ఏ ముత్యాలు

అధికారులు స్పందించాలి



ఏటీఎంలలో ఏసీలు పనిచేక ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల అధికారులు స్పందించి ఏటీఎంలలో సౌకర్యాలు కల్పించాలి. మేము బ్యాంకులలో దాచుకున్న డబ్బులు మేము తీసుకునేందుకు ఎంతగానో ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– సుబ్బారావు

వ్యాధులు సోకకుండా జాగ్రత్త వహించాలి


రమీజ్ అహమ్మద్

బల్లికురవ: వర్షాల సీజన్ ఆరంభమైనందున సీజనల్ వ్యాధులు సోకకుండా గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తతో తగు జాగ్రత్తలు వహించాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహమ్మద్ మంగళవారం తెలిపారు. వర్షాలకు మలేరియా, డెంగీ, టైఫాయిడ్ సోకే ప్రమాదం ఉందని పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే సీజనల్ వ్యాధులు సోకకుండా ఆరోగ్యవంతులుగా జీవించవచ్చన్నారు. నిలువ ఉన్న ఆహారాలు తీసుకోవద్దని, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, కుంటలు, చెరువులోని నిలువ ఉన్న నీరు తాగవద్దని చెప్పారు. అస్వస్థతకు లోనైతే తక్షణమే వైద్యశాలలకు వెళ్లి వైద్యం చేయించుకోవాలన్నారు. ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోవద్దన్నారు.

6,7 తేదీల్లో బస్‌పాస్ కౌంటర్లు పనిచేయవు

చీరాల అర్బన్: చీరాల ఆర్టీసీ డిపోలో కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్న కారణంగా ఈనెల 6,7 తేదీల్లో బస్‌పాస్ కౌంటర్లు పనిచేయవని డిపో మేనేజర్ జె.శ్యామల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి బస్‌పాస్‌ల జారీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులు, ప్రయాణికులు ఈవిషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు


వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు మంగళవారం గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, వక్తృత్వ పోటీలు, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్, చెస్‌లపై శిక్షణ ఇచ్చారు. వేసవి విజ్ఞాన శిబిరంలో 15 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథపాలకుడు తెలిపారు.

పొగాకు గోదాం దగ్ధం

టంగుటూరు: టీడీపీ కార్యకర్తలు కాల్చిన బాణాసంచా పొగాకు గోదాముపై పడి దగ్ధమైంది. ఈఘటన మండలంలోని జమ్ములపాలెంలో మంగళవారం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. టీడీపీ కార్యకర్తలు బాణసంచా కాల్చగా అది వెళ్లి పక్కనే ఉన్న అల్లపాటి రాజేష్‌కు చెందిన కేకే మోహన్ ఎంటర్‌ప్రైజెస్ గ్రేడింగ్ గోదాముపై పడింది. నిప్పురవ్వలు పక్కనే ఉన్న పొగాకు చెక్కలకు అంటుకోవడంతో కొన్ని బేళ్లు దగ్ధమయ్యాయి. రూ.1.50 లక్షల మేర నష్టం వాటిల్లింది. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపు చేశారు.


జమ్ములపాలెంలో ధగ్ధమవుతున్న పొగాకు గోదాము

కొనసాగుతున్న 144, 30 పోలీసు యాక్టు

- ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు
- ఇళ్లకే పరిమితమైన ప్రజలు

చీరాల రూరల్: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను దృష్టిలో పెట్టుకుని పోలీసులు సెక్షన్ 144తో పాటు 30 పోలీసు యాక్టును కఠినంగా అమలు చేస్తున్నారు. కౌంటింగ్‌కు ముందురోజు అనగా సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి పోలీసులు దుకాణాలను మూసివేయించారు. ఏడు గంటలకల్లా సెంటర్లలో ఉన్న జనాల్ని కూడా ఇళ్లకు తరలించారు. అయితే మంగళవారం కూడా ఇదే పరిస్థితిని పోలీసులు కొనసాగించారు. మంగళవారం ఉదయం నుంచి కౌంటింగ్ జరుగుతున్నంతసేపు ప్రజలు టీవీలు, ప్రచార మాధ్యమాలకు అతుక్కుపోయిన ప్రజలు సాయంత్రం సమయంలో పాలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు ఇళ్ల నుంచి ద్విచక్రవాహనాలు వేసుకుని బయటకు వచ్చారు. అయితే పోలీసులు పట్టణాన్ని పోలీసులు వలయంలో నింపేశారు. ద్విచక్రవాహనం కనపడితే అక్కడికక్కడే వాహనాలు నిలిపివేసి వారి వాహన తాళాలు లాక్కుని ఎక్కడికి వెళ్తున్నారనే సమాచారం తీసుకుంటున్నారు. పట్టణంలోని సాల్మన్ సెంటర్ మొదలుకొని ప్రసాద్ థియేటర్ సెంటర్, ముంతావారి సెంటర్, కొట్లబజారు, మున్సిపల్ హైస్కూలు రోడ్డు, రైల్వే స్టేషన్, బస్టాండ్, వైకుంఠపురం, హరిప్రసాద్‌నగర్, ఉజిలీపేట, జాన్‌పేట, జయంతిపేట, శాంతినగర్, పేరాల, వంటి ప్రాంతాలలో పోలీసులు కఠినమైన ఆంక్షలు విధించారు. కారంచేడు గేటు సెంటర్‌లో జాన్‌పేట, జయంతిపేట, మరియమ్మపేట వాసులను బయటకు రాకుండా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి నిలిపివేశారు. రోడ్డుపై ఇనుప కంచెలు వేసి ద్విచక్రవాహనాలను అడ్డుకున్నారు. పాలు, మందు బిళ్లలు, నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు కూడా వీలులేదంటూ అడ్డుకున్నారు. కరోనా సమయంలో పోలీసులు విధించిన లాక్‌డౌన్‌ను ప్రస్తుతం పోలీసులు గుర్తుచేశారంటూ జనాలు పోలీసులను శాపనార్థాలు పెట్టారు.


కారంచేడు గేటు సెంటర్లో ఇనుప కంచెలు వేసి జనాలను అడ్డుకుంటున్న పోలీసులు


గడియార స్తంభం సెంటర్‌లో పహారా కాస్తున్న పోలీసులు

అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు..

చీరాల అర్బన్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలో 144 సెక్షన్ అమలు చేశారు. దీంతో సోమవారం సాయంత్రం 5గంటల నుంచి షాపులు మూసివేశారు. మంగళవారం సాయంత్రం వరకు పట్టణంలో రోడ్లన్ని నిర్మానుషంగా మారాయి. హోటళ్లు, సినిమా హాళ్లు, దుకాణాలు అన్ని మూసివేశారు. మందుల షాపులు, పాలకేంద్రాలకు మినహాయింపు ఇచ్చారు. ఒన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు పి.శేషగిరిరావు, బీ.సోమశేఖర్, ఎస్.సత్యనారాయణల ఆధ్వర్యంలో ఎస్సైలు, స్పెషల్ పార్టీ పోలీసులు, సిబ్బంది ప్రధాన కూడళ్లలో పహారా కాశారు.


పట్టణంలో పహారా కాస్తున్న సీఐ శేషగిరిరావు


ఎన్‌హెచ్ 216 హైవే వద్ద కొత్తపేటలో వేసిన ఇనుప కంచె


నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే రైల్వే ఓవర్ బ్రిడ్జిపై వాహనాలు లేక వెలవెలబోతున్న దృశ్యం


బస్టాండ్ సెంటర్లో మూసివేసిన దుకాణాలు